
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

కోనసీమ

జిల్లా వార్తలు

బుధవారం 27 నవంబరు 2024 | 5



అంతర్వేది క్షేత్రానికి విచ్చేస్తున్న స్వామీజీ

అంతర్వేది క్షేత్రానికి విధుశేఖర భారతీమహాస్వామి

సముద్ర స్నానమాచరించిన స్వామీజీ

లక్ష్మీనరసింహునికి ప్రత్యేక పూజలు

7లో



జబర్దస్త్ రాజమౌళి కామెడీ

ద్రాక్షారామలో కనుల పండువగా కార్తీక దీపోత్సవం

జబర్దస్త్ బృందం సందడి

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

6లో



ఐపీఎల్‌లో గోగన్నమఠం కుర్రోడు

రూ.30 లక్షల రేటు పలికిన సత్యనారాయణరాజు

6లో

తీరంలో అలల బీభత్సం



అల్లవరం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో అలలు ఉవ్వెత్తిన ఎగిసిపడి సముద్రతీరం అల్లకల్లోలంగా మారింది. అల్లవరం మండలం ఓడలరేవు, కొమరగిరిపట్నం, ఎస్.రామేశ్వరం సముద్ర తీరంలో అలలు ఎగిసిపడుతున్నాయి. తీరం వెంబడి భారీ గాలులు వీస్తూ అలల ఉధృతి పెరిగింది. అలల కారణంగా సముద్ర తీరం వెంబడి చాలా వరకు భూమి కోతకు గురై సముద్ర కెరటంలో కలిసిపోతోంది. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సముద్రంలో చేపల వేట నిలిపివేశారు. సార్వా కోతల సమయంలో తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ పొంచి ఉన్నందున రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అల్లవరంలో తహశీల్దారు వీవీఎల్ నరసింహారావు అత్యవసర సమావేశం నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దారు అడపా సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.



కొబ్బరి పువ్వు.. రుచే వేరు!

ప్రత్యేక కథనం 6లో



మున్సిపల్ కార్యాలయం వైపే వ్యాపార సంస్థ పొగగొట్టాలు



అమలాపురం మున్సిపల్ కార్యాలయం చెంతన వ్యాపార సముదాయ భవనం



మున్సిపల్ కార్యాలయం వాహనాల పార్కింగ్ ప్రదేశంలో వ్యాపార సంస్థ జనరేటర్, ఇతర సామగ్రి

మున్సిపల్ కార్యాలయం ఆవరణే లక్ష్యంగా

యథేచ్ఛగా ఆక్రమణలు

ఈ-సేవ భవనంలో

వ్యాపార సామ్రాజ్య విస్తరణ కోసం..

జనరేటర్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్,

పొగ గొట్టాలు..

ఇవన్నీ మున్సిపల్ కార్యాలయం వైపే

పట్టించుకోని అధికారులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి):

సాక్షాత్తూ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన మార్గం లక్ష్యంగా చేసుకుని వ్యాపార సామ్రాజ్యం విస్తరణ పనులు చేస్తున్నా మున్సిపల్ అధికారులు మాత్రం చోద్యం చూస్తూనే ఉన్నారు. జిల్లా కేంద్రమైన అమలాపురం పురపాలక సంఘంలోని అధికారులు ఇటువంటి అక్రమాలు కళ్లముందే కనిపిస్తున్నా పట్టించుకోరనడానికి ఇదో చిన్న ఉదాహరణ మాత్రమే. మున్సిపల్ కార్యాలయ ప్రహరీని ఆనుకుని గతంలో పురపాలక శాఖ నిర్మించిన ఈ-సేవా కేంద్రం భవనంలో ప్రస్తుతం ఒక ప్రముఖ వ్యాపార సంస్థ స్థానిక భాగస్వామ్యంతో వ్యాపారాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఆ మున్సిపల్ భవనాన్ని ఒకరి నుంచి అద్దెకు తీసుకుని చకచకా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే ఈ సంస్థ భాగస్వామ్యంలో కీలకపాత్ర వహిస్తున్న మున్సిపల్ కాంట్రాక్టరు ఒకరు వైసీపీ, కూటమి పెద్దల సంయుక్త సహకారంతో ఏకంగా మున్సిపల్ కార్యాలయ ముఖ ద్వారాన్నే లక్ష్యంగా చేసుకుని వ్యాపార విస్తరణను చేపట్టారు.

దీనిలో భాగంగా మున్సిపల్ కార్యాలయానికి వెళుతున్నప్పుడు ఎడమవైపు ప్రహరీని ఆనుకుని గతంలో వాహనాలు, మోటారు సైకిళ్లు పెట్టుకునేందుకు పురపాలక సంఘం ఒక షెడ్డును ఏర్పాటు చేసుకుంది. ఇప్పుడు ఆ షెడ్డు పక్కనే ఉన్న ఈ-సేవ భవనంలో కొత్తగా ప్రారంభిస్తున్న వ్యాపార సంస్థకు చెందిన భారీ జనరేటర్‌ను ఆ షెడ్డులో ఏర్పాటు చేశారు. అక్కడే ఆ వ్యాపార సామ్రాజ్యం కోసం కావాల్సిన ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం భారీ సిమెంటు దిమ్మను ఇప్పటికే నిర్మించారు. వీటితో పాటు ఆ వ్యాపార సంస్థకు సంబంధించిన కేబుల్స్, ఇతర స్విచ్‌బోర్డులు సైతం మున్సిపల్ కార్యాలయం పక్కనే ఏర్పాటు చేస్తున్నా బాధ్యత గల అధికారులు చోద్యం చూడడానికి కారణం రాజకీయ పెద్దల పలుకుబడేనని విమర్శలు వినిపిస్తున్నాయి. వీటితో పాటు భారీ పొగ గొట్టాలు సైతం ఈ-సేవ బిల్డింగ్ నుంచి మున్సిపల్ కార్యాలయం వైపు పెట్టిన తీరు చూస్తుంటే ఆ సంస్థ ప్రతినిధులు మున్సిపల్ అధికారులు పెద్ద పొగే పెడుతున్నట్టు తెలుస్తోంది. వ్యాపార ఒప్పంద లావాదేవీల్లో సైతం అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. దీనికితోడు అధికార వైసీపీకి చెందిన కౌన్సిలర్లతో పాటు ప్రతిపక్ష కౌన్సిలర్లు సైతం ఈ వ్యవహారంపై పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో అదే భవనంలో కొన్ని ప్రైవేటు వ్యాపార సంస్థలు నెలకొల్పినప్పటికీ వారేమీ ఈ తరహా ఆక్రమణలకు తావివ్వకుండా చేశారు. ఇప్పుడు అన్నీ తానే చేస్తున్నా అఖిల పక్ష కాంట్రాక్టరు ఒకరు ఈ మొత్తం వ్యవహారాన్ని నడిపిస్తున్న తీరు పట్టణంలో చర్చనీయాంశమైంది. రాజకీయ పెద్దలు సహకారం లేకపోతే ఈ తరహా ఏర్పాట్లు చేయడం కష్టమని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై మున్సిపల్ అధికారులు విచారణ జరిపి చర్యలు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై కౌన్సిలర్ల ఆగ్రహం

అమలాపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అమలాపురం పురపాలక సంఘ వాహనాల షెడ్డులోనే వ్యాపార సంస్థకు సంబంధించిన జనరేటర్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణానికి దిమ్మ నిర్మించిన తీరుపై విపక్ష టీడీపీ, జనసేన కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజును మంగళవారం ప్రశ్నలతో ముంచెత్తారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా ఇష్టానుసారం చేస్తారా అని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో కౌన్సిల్‌కు తీసుకురాలేదని కమిషనర్ వివరణ ఇచ్చారు. వ్యాపార సంస్థకు వచ్చే వినియోగదారులు పార్కింగ్ కోసం మున్సిపల్ స్థలాన్ని తీసుకునే పరిస్థితి వస్తే ఏం చేస్తారని ప్రశ్నించారు. ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నా వ్యాపారసంస్థకు అధికారులు వత్తాసు పలకడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు యేడిద శ్రీను, తిక్కా సత్యలక్ష్మి, పడాల శ్రీదేవి, గొలకోటి విజయలక్ష్మి, గండి దేవిహారిక, అబ్బిరెడ్డి చంటి, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, టీడీపీ పట్టణశాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ ఉన్నారు.



అంబేడ్కర్‌కు నమస్కరిస్తున్న కలెక్టర్

ప్రజాస్వామ్యానికి ప్రాథమిక హక్కులే పునాది

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి భారత రాజ్యాంగ ప్రాథమిక హక్కులే పునాదులని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పేర్కొన్నారు. 75వ భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని (వజ్రోత్సవం) పురస్కరించుకుని సంవిధాన్ దివస్ పేరిట కలెక్టరేట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు జేసీ టి.నిషాంతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏటా నవంబరు 26న రాజ్యాంగ ఆమోద దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. అదే విధంగా జాతీయ న్యాయ దినోత్సవాన్ని కూడా నిర్వహించుకుంటున్నామన్నారు. అంబేడ్కర్ సారథ్యంలో రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు కష్టపడి వివిధ దేశాల రాజ్యాంగాల నుంచి అవసరమైన సమాచారాన్ని సేకరించి మన దేశానికి అవసరమైన పూర్తిస్థాయి రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. అంబేడ్కర్ 125వ జయంతి సందర్భంగా ఏటా నవంబరు 26న భారత రాజ్యాంగ దినోత్సవంగా జరపాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు ప్రజలకు రక్షణ కవచంగా మార్చారన్నారు. జేసీ నిషాంతి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. డీఆర్వో వి.మదన్మోహనరావు రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞను కలెక్టరేట్ సిబ్బందితో చేయించారు. ఏవో కె.కాశీవిశ్వేశ్వరరావు, మురళీకృష్ణ, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి

ప్రణాళికలు రూపొందించాలి

● బోట్ రేస్ నిర్వహణకు ఏర్పాట్లు ● కలెక్టర్ మహేష్‌కుమార్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పర్యాటకులకు ప్రకృతి రమణీయతతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందించేందుకు జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. ఆత్రేయపురం మండలం లొల్ల లాకులు ఎగువ భాగంలో బోట్ రేసు నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లా పర్యాటక కమిటీ ఆధ్వర్యంలో పాశర్లపూడి, ఆదుర్రు గ్రామాల్లో బోటింగ్ టెర్మినల్స్ ఏర్పాటు, కోటిపల్లిలో టూరిజం రిసార్ట్, ఆపరేషన్ మేనేజ్‌మెంట్ నిర్వహణ పనులు, ఆత్రేయపురం లొల్ల లాకుల వద్ద ఫెడల్ బోట్ రేస్ నిర్వహణ అంశాల పురోగతిపై మంగళవారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లా పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లొల్ల లాకుల వద్ద ప్రస్తుతం జలవనరుల శాఖ ఆధీనంలో ఉన్న కట్టడాల జోలికి వెళ్లకుండా మిగిలిన ప్రాంతాన్ని అద్దె ప్రాతిపదికన ఏజెన్సీలకు కేటాయిస్తూ ఫెడల్ బోట్ రేస్ నిర్వహణ లాభదాయకంగా నిర్వహించాలన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతం లాకుల వద్ద బోట్ రేస్ మాదిరిగా ఆర్థిక పరమైన నమూనాలు రూపొందించి డిసెంబరు 3 నాటికి సమర్పించాలని ఆదేశించారు. సంక్రాంతి పండుగ వేళల్లో గతంలో బోట్ షికార్ నిర్వహించిన మత్స్యకార ఏజెన్సీలను, పర్యాటక ఏజెన్సీలను సంప్రదించాలని ఆదేశించారు. పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. భూముల విలువ, నిర్మాణాల పెట్టుబడి, వచ్చే ఆదాయం తదితర అంశాలతో ప్రణాళికలు రూపొందించాలని కొత్తపేట ఆర్డీవో శ్రీకర్‌ను ఆదేశించారు. అవసరమైతే ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో పర్యాటకుల సౌకర్యార్థం బారి కేడింగ్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో మదన్మోహనరావు, జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి వెంకటాచలం, డివిజనల్ మేనేజర్ పవన్‌కుమార్, మేనేజర్ గంగబాబు, జలవనరులశాఖ డీఈలు బి.శ్రీనివాసరావు, కేవీఎస్ సుబ్బారావు, దేవదాయ, ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

108 సేవలు ఆగకుండా ప్రత్యామ్నాయ చర్యలు

అమలాపురం టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 108 ఉచిత అంబులెన్సు అత్యవసర సేవలు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. వైద్య పరమైన అత్యవసర పరిస్థితుల్లో, వైద్య సంరక్షణ అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వైద్యాధికారులు, 108 సమన్వయ అధికారులతో సమావేశం నిర్వహించారు. 108 అత్యవసర వైద్య సేవలకు సంబంధించి అరబిందో సంస్థ వాహన డ్రైవర్లు ఆ సంస్థ తీరుకు నిరసనగా ధర్నాకు దిగడంతో వైద్య సేవలు నిలిచిపోకుండా తాత్కాలిక ప్రాతిపదికన ప్రత్యామ్నాయంగా నాలుగు చక్రాల లైట్ మోటార్ వాహన లైసెన్సు కలిగిన వారిని జిల్లా రవాణాధికారి సమన్వయంతో నియమిస్తున్నట్టు వెల్లడించారు. రోజుకు రెండు షిఫ్టుల్లో వారు పనిచేసేలా నియమించాలన్నారు. కనీస వేతనం షిఫ్టుల వారీగా అందిస్తామన్నారు. జాతీయ గ్రామీణ హెల్త్‌మిషన్ నిధులతో ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ వాహనాల్లో పనిచేసే మిడ్ లెవెల్, హెల్త్ వర్కర్లు 432 మందికి అడ్వాన్స్ లైఫ్ సపోర్టు వైద్యసేవలపై టెక్నీషియన్ల ద్వారా శిక్షణ ఇప్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిని ఆదేశించారు. జిల్లాలో ఐదు అడ్వాన్స్ లైఫ్ సపోర్టు 108 అత్యవసర వైద్య సేవల వాహనాలు ఉండగా 39 బేసిక్ సపోర్టు వాహనాలు ఉన్నాయని తెలిపారు. అత్యవసర వైద్య సేవల జిల్లా కోఆర్డినేటర్ అజయ్, జిల్లా వైద్యసేవల సమన్వయ అధికారి కార్తీక్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా రవాణాశాఖాధికారి డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



యాప్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

దేశ్‌కా ప్రకృతి పరీక్షణ్ ఆయుష్ యాప్ ప్రారంభం

అమలాపురం టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దేశ్‌కా ప్రకృతి పరీక్షణ్ ఆయుష్ మొబైల్ యాప్‌ను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లో ప్రారంభించారు. ధన్వంతరి జయంతి సందర్భంగా అక్టోబరు 29న ప్రధాని నరేంద్రమోదీ ఈ యాప్‌ను ప్రారంభించారన్నారు. జిల్లాలో యాప్ పూర్తిగా అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. నవంబరు 26 నుంచి డిసెంబరు 25 వరకు ఆత్రేయపురం, అంబాజీపేట ఆయుర్వేద ఆసుపత్రుల్లో పేషెంట్లను ఈ యాప్‌లో రిజిస్టర్ చేస్తారన్నారు. ప్రతీ పౌరుని శారీరక, మానసిక ఆరోగ్య సమాచారం యాప్‌లో పొందుపరుస్తారన్నారు. ప్రతీ పౌరుడు ప్రకృతిని అనుసరించి పాటించాల్సిన దినచర్య, రుతుచర్యలను ఫోన్ నంబర్లకు ఎప్పటికప్పుడు సమాచారం అందించనున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కె.విజయకుమారి, డాక్టర్ బి.శ్యామ్‌సుందరరావు, సుధీర్‌కుమార్, వడ్డాది కుమార్, సూర్య, మూర్తి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు 'తుఫాన్' భయం



పి.గన్నవరంలో ధాన్యం ఆరబెడుతున్న దృశ్యం

పి.గన్నవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం ప్రభావంతో గత రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమైంది. దీంతో అన్నదాత గుండెల్లో గుబులు మొదలైంది. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో వర్షాలు పడే అవకాశం ఉందని ప్రకటనలు గుప్పించడంతో అన్నదాత హైరానా పడుతున్నాడు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 50 శాతం వరికోతలు పూర్తయినప్పటికి ప్రస్తుతం కొన్ని మండలాలలో 10 శాతం కూడా వరి కోతలు పూర్తి కాలేదు. ప్రతి ఏడాది మొదటి, రెండో పంటల కోతల సమయంలో ఇదే పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల ఇంకా కళ్లాల్లో ధాన్యం రాశులు ఉన్నందున వాతావరణంలో మార్పులు సంభవించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం అందించే గిట్టుబాటు ధర కంటే బయట మార్కెట్ గిరాకీగా ఉండటంతో రైతులు బయట మార్కెట్‌కే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఈసారి మొదటి పంటకు 1318, స్వర్ణ రకాలను రైతులు ఎక్కువగా ఎంచుకున్నారు. అయితే స్వర్ణ రకం మాత్రం ముందుగా రావడంతో దాదాపుగా కోతలు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. మొదటి పంటకు సంబంధించి ఈసారి జిల్లా వ్యాప్తంగా 1,57,810 ఎకరాల్లో పంట పండించారని ప్రస్తుతం 82,466 ఎకరాల్లో కోతలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఈసారి 4 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడికి గాను ప్రస్తుతం 2 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా 86,466 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. కాగా రామచంద్రపురం, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం తదితర మండలాల్లో దాదాపుగా వరికోతలు పూర్తయ్యాయి. ఇక పి.గన్నవరంతో పాటు కోనసీమలోని పలు మండలాల్లో ఇప్పుడిప్పుడే ముమ్మరంగా కోతలు ప్రారంభమయ్యాయి. అయితే వరికోతలు పూర్తిచేసుకున్న రైతులు తమ ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలలో భద్రపరుచుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలను

విజయవంతం చేయాలి

రాజకీయ సమావేశాల్లా నిర్వహించొద్దు: కలెక్టర్

అమలాపురం టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7న జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల మెగా సమావేశాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో మంగళవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన మెగా సమావేశాల నిర్వహణ విధివిధానాలపై సమీక్షించారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల మెగా సమావేశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు డిసెంబరు 7న బాపట్ల జిల్లా నుంచి ప్రారంభిస్తారని తెలిపారు. పాఠశాలల్లో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పూర్వపు ప్రధానోపాధ్యాయులు గ్రామంలోని స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు, గ్రామపెద్దలు, విద్యావంతుల సహకారంతో పాఠశాల విద్యను బలోపేతం చేయడంతో పాటు నైతిక విలువలతో కూడిన గుణాత్మక విద్యాబోధనకు చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతీ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా ఐదు పాఠశాలలను ఎంపిక చేసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. నిర్దేశిత పారామీటర్లలో విద్యార్థుల ఎత్తు, బరువు, రక్త గ్రూపు తదితర అంశాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి హెచీస్టిక్ హెల్త్‌కార్డులను జారీ చేయాలని ఆదేశించారు. తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల మెగా సమావేశాలను రాజకీయ సమావేశాల్లా నిర్వహించరాదని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, మండల విద్యాశాఖాధికారులు, డీఈ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



కొబ్బరి పువ్వు.. రుచే వేరు!

పోషకాలు మెండు

షుగర్, క్యాన్సర్ రాకుండా దూరం చేసే కోకోనట్ ఫ్లవర్

కొబ్బరిలో ప్రతి వస్తువు మనకు ఉపయోగమే. కొబ్బరిలో ఆరోగ్యవంతమైన పోషకాలు ఉంటాయి. ఇందులో కొబ్బరి పువ్వు ఒకటి. గుండ్రంగా తెల్లగా గుడ్డు ఆకారంలో కనిపించే ఈ కొబ్బరి పువ్వును ఒకసారి రుచి చూస్తే మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది. అందంగా కనిపించే ఈ కొబ్బరి పువ్వుకు అంతే విలువా ఉంది. వీటిని కొబ్బరిపూలు, కొబ్బరి గుడ్లు అని పిలుస్తారు. అరుదుగా లభించే ఈ కొబ్బరి పూలను ఈ ప్రాంతం ప్రజలే కాకుండా దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారూ కొబ్బరి పూలను కొనుగోలు చేసుకుని తింటుంటారు. దేవుడికి సమర్పించే కొబ్బరికాయ కొట్టినప్పుడు కొబ్బరిచెక్కలో ఈ పువ్వు వస్తే చాలా అదృష్టంగా భావించడం తెలిసిందే.

(ఆంధ్రజ్యోతి-అంబాజీపేట)

కోనసీమ ప్రాంతంలో రైతులు నీటికాయ వ్యాపారులు దింపి తీసిన కొబ్బరికాయలను పెద్ద పెద్ద రాశులుగా పోసి సరైన గిట్టుబాటు ధర వచ్చినప్పుడు వాటిని అమ్మడం సర్వసాధారణం. ఇలా పచ్చికాయలను నాలుగు నెలలపాటు ఉంచితే ఆరు బయట, కొబ్బరి ఆకులు కప్పి ఉంచితే వాటి రంగు మారి ముక్కుడు కాయలుగా మారుతాయి. ఈ కాయలు ఎక్కువకాలం నిల్వఉంటే బయట వాతావరణంలో ఉన్న తేమ శాతాన్ని వర్షపు నీటిని పీల్చుకుని మొక్కలు మొలిచి కొబ్బరికాయల్లో పూలు అభివృద్ధి చెందుతాయి. కొబ్బరికాయలకు తేమశాతం ఎక్కువగా లభించినప్పుడు ప్రకృతిపరంగా జరిగే ప్రక్రియ వల్ల కాయల లోపల తెల్లని అంకురం మొలుస్తుంది. ఇది క్రమంగా పెరిగి పెద్దదై పువ్వుగా మారి కాయల లోపల పెరుగుతూ లోపల ఉన్న నీటిని పీల్చుకుంటూ కాయ లోపలున్న ఖాళీ ప్రదేశాన్ని ఆక్రమిస్తుంది. ఈ పువ్వులను యాపిల్ లేదా హాస్టోరియం అనే శాస్త్రీయ నామంతో పిలుస్తారు. ఈ కొబ్బరి పూలు కొబ్బరినీటిలో ఉండే పోషక విలువల్ని గ్రహిస్తూ ఎంజైమ్స్ సహాయంతో లోపల ఉండే కొబ్బరి మందాన్ని తగ్గిస్తూ పూర్తి పోషక పదార్థాలతో పూలు తయారువుతాయి.

పోషకాలు మెండు..

ఈ పువ్వులో ఒమెగా 3 ప్లాటీ ఆమ్లాలు, ఒమెగా 6 ప్లాటీ ఆమ్లాలు మెండుగా ఉంటాయి. విటమిన్-సి, విటమిన్- ఎ, ఐరన్, కాపర్, పోటాషియం, కాల్షియం మొదలైనవి ప్రతిరోజూ ఈ కొబ్బరి పువ్వు తినడం వల్ల శరీరానికి కావాల్సిన ఖనిజ లవణాలు అందుతాయి. ఫైబర్ ఎక్కువగా ఉండడంతో జీర్ణశక్తిని పెంచి మలబద్ధకాన్ని నివారిస్తుంది. చిన్న పిల్లలకు, చదువుకునే వారికి జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ఒత్తిడితో కూడా నిరుద్యోగులు మంచి ఆహారం, ఈ కొబ్బరి పువ్వులను తినడం శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. షుగర్ ఉన్నవారు ప్రతిరోజు తీసుకోవడం వల్ల షుగర్ కంట్రోల్ చేస్తుంది. థైరాయిడ్ ఉన్నవారికి మంచి మందుగా ఉపయోగపడుతుంది. క్యాన్సర్ కణాలను నాశనం చేసి క్యాన్సర్ రాకుండా దోహదం చేస్తుంది. మృతకణాలను నాశనం చేసి చర్మ సౌందర్యాన్ని పెంచుతుంది. జుట్టు కుదుళ్లకు పోషకాలు అంది జుట్టు రాలడాన్ని అరికట్టి, పొడవుగా పెరగడానికి దోహదపడుతుంది. చెడు కొలస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ వృద్ధి చెంది ఎల్లప్పుడూ గుండెను ఆరోగ్యంగా ఉండేలా దోహదం చేస్తుంది. ఈ పువ్వు తినడం ద్వారా ఇంకా అనేక ఉపయోగాలు ఉన్నాయి. ప్రతిరోజూ తినడంతో కిడ్నీలను శుభ్రపరిచి రాళ్లు ఏర్పడకుండా చేస్తుంది.

ఇతర ప్రాంతాలకు ఎగుమతి...

అంబాజీపేట పరిసర ప్రాంతాల్లోని వ్యాపారులు ఈ కొబ్బరి పువ్వులను ఆర్డర్లు బట్టి అందిస్తారు. వీటి తెల్లవారుజామున రైతుల నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తారు. ఇవి ఎక్కువ రోజులు నిల్వ ఉండవు. దీంతో వ్యాపారులు అవసరాలకు అనుగుణంగా ఆయా రైతులకు ఆర్డర్లు అందిస్తారు. హైదరాబాద్, కాకినాడ, అమలాపురం, తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు, విజయవాడ, నిడదవోలు తదితర ప్రాంతాలకు వీటిని ఎగుమతులు చేస్తారు. కొబ్బరి పువ్వులు సైజులను బట్టి ధర నిర్ణయిస్తారు. రైతుల వద్ద కొబ్బరి పువ్వు రూ.2 నుంచి రూ.5 వరకు కొనుగోలు చేస్తారు. వాటిని స్థానిక వ్యాపారులు మార్కెట్‌లో రూ.10 నుంచి 15 వరకు విక్రయిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో అయితే రూ.25పైబడే విక్రయిస్తున్నారు.



పోషకాలు అధికం..

కొబ్బరి పువ్వులో 66 శాతం కార్బోహైడ్రేట్లు, 64 శాతం సాల్యుబుల్ షుగర్స్ ఉంటాయి. ఫైబర్‌తోపాటు మినరల్స్ న్యూటియెంట్లు, యాంటీ బయాటిక్స్ ఉంటాయి. ఆరోగ్యకరంగా ఉండేందుకు ఈ కొబ్బరి పువ్వులు తినడం మంచిదే. పోషకాలు కలిగిన ఈ కొబ్బరి పువ్వును తినడం ద్వారా కొన్ని వ్యాధులు దూరం అవుతాయి. **- డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్ర అధిపతి, అంబాజీపేట**



ప్రస్తుతం మంచి డిమాండ్ ఉంది..

సీజనల్‌గా దొరికే కొబ్బరి పువ్వులకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉంది. ఇతర ప్రాంతాల నుంచి ఆర్డర్లు రావడంతో ఎగుమతి చేస్తున్నాం. అలాగే ఈ ప్రాంతంలో వీటిపై ఇష్టంగా ఉన్నవారు కొనుగోలు చేసుకుని తీసుకుని వెళుతున్నారు. గతంలో ఈ కొబ్బరి గుడ్లను ఉచితంగా అందించేవాళ్లం. అయితే ప్రస్తుతం వీటికి డిమాండు ఎక్కువగా ఉండడంతో ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయాలు చేపడుతున్నాం. **- సుదాబత్తుల వెంకటరామకృష్ణ, వ్యాపారి, అంబాజీపేట**

ఐపీఎల్‌లో గోగన్నమఠం కుర్రోడు

రూ.30 లక్షల రేటు పలికిన సత్యనారాయణరాజు.. అంతటా హర్షాతిరేకాలు



సత్యనారాయణరాజు

ఐపీఎల్‌కు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఏ చిన్న అప్‌డేట్ వచ్చినా అది క్రీడాభిమానులకు అది పండగలాంటిదే. అందులోనూ ఐపీఎల్ సీజన్‌లో ఎవరు ఏ జట్టు తరఫున ఆడతారోనన్నది తీవ్ర ఉత్కంఠ కలిగించే అంశం. అలాంటిది మన కోనసీమ కుర్రాడొకడు ఐపీఎల్‌కు ఎంపికవడం ఎంత పెద్ద విషయం మరి. మామిడికుదురు మండలం గోగన్నమఠం గ్రామానికి చెందిన పెన్మెత్స వెంకట సత్యనారాయణరాజు ఐపీఎల్ వేలంలో రూ.30 లక్షల పలికి ముంబై ఇండియన్స్‌లో చోటు సంపాదించేశాడు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని క్రికెట్ అభిమానులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ గోదావరి జిల్లా కుర్రాడి ఆట కోసం అంతా ఎదురుచూస్తున్నారు.

కాకినాడఅర్బన్/మామిడికుదురు,నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆ సోదరులిద్దరికీ చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే పిచ్చి. ఎలాగైనా సరే ఆటలో అదరగొట్టాలన్నదే వారి టార్గెట్. అందుకు అనుగుణంగా తల్లిదండ్రుల ప్రోత్సాహం, శిక్షకుల సహకారం క్రికెట్‌లో వారు రాణించేందుకు తోడ్పడ్డాయి. ఐపీఎల్ వేలంలో రూ.30 లక్షలు దక్కించుకుని ముంబై ఇండియన్స్‌లో చోటు సంపాదించిన ఆటగాడు పెన్మెత్స వెంకట సత్యనారాయణరాజు ఈ సోదరుల్లో ఒకరు. అతనితోపాటు సోదరుడు పాండురంగ రాజు క్రికెట్‌లోనే రాణిస్తున్నాడు. పలు రంజీ ట్రోఫీల్లోనూ ఇతనూ పాల్గొన్నాడు. ఐపీఎల్‌లో చోటు సంపాదించుకున్న వెంకట సత్యనారాయణరాజు తండ్రి పెన్మత్స రమేష్‌రాజు స్వగ్రామం అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం గోగన్నమఠం. దాంతో సత్యనారాయణరాజు ప్రాథమిక విద్యాభ్యాసం స్థానికంగానే ఓ ప్రైవేటు స్కూలులో జరిగింది. తదనంతరం కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. తమ పిల్లల అభీష్టం మేరకు పదో ఏట నుంచే అన్నదమ్ములకు రమేష్‌రాజు క్రికెట్‌లో శిక్షణ ఇప్పించారు. అక్కడ క్రికెట్‌లో ఓనమాలు నేర్చుకుని తమ ప్రస్థానాన్ని మళ్లీ కోనసీమ నుంచి ప్రారంభించారు. అంబాజీపేటలోని క్రికెట్ సబ్‌సెంటర్‌లో ఈ సోదరులు మూడు సంవత్సరాలు శిక్షణ తీసుకున్నారు. తర్వాత ఉద్యోగరీత్యా రమేష్‌రాజు కాకినాడలో స్థిరపడడంతో కాకినాడలోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెంటర్‌లో వీరిద్దరూ శిక్షణ పొంది రాటుదేలారు. అక్కడి నుంచి అండర్-14 నుంచి అండర్-19 వరకు జిల్లా, రాష్ట్రస్థాయిలో క్రికెట్ పోటీల్లోను, అండర్-23 నుంచి అండర్-25 వరకు రాష్ట్రస్థాయి పోటీల్లోను, ఆంధ్రా రంజీ ట్రోఫీల్లో పాల్గొని వీరు ప్రతిభ కనబరిచారు. ఇక ఇంటర్ వరకు ఆదిత్యలో చదివిన సత్యనారాయణ రాజు ఎస్ఆర్ఎంలో ఎంబీఏ పూర్తిచేశారు. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న ధ్యేయంతో ఉండగా, ఆంధ్రా ప్రీమియల్ లీగ్‌లో గోదావరి టైటాన్స్ తరఫున పాల్గొని ఇప్పుడు ఏకంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ ముంబై జట్టుకు ఎంపికయ్యాడు. గతంలో తన వద్ద శిక్షణ తీసుకుని జాతీయస్థాయి పోటీలకు ఎంపికవ్వడంపై ఏసీఏ కోచ్ మట్టా సత్తిబాబు ఆనందం వ్యక్తం చేశారు. అటు డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న రాజు తమ్ముడు పాండురంగరాజు కూడా క్రికెట్‌లో మరింత రాణించాలనుకుంటున్నాడు. ఇటు ఫాస్ట్‌బౌలర్‌గా సత్యనారాయణరాజు ఆట కాకినాడ క్రికెట్ అభిమానులకు సుపరిచితమే. ఐపీఎల్ వేలం పాటలో గోగన్నమఠం గ్రామానికి చెందిన సత్యనారాయణరాజును ముంబై ఇండియన్స్ దక్కించుకోవడంతో స్వగ్రామంలోను, ఇటు కాకినాడ నగరం లోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన రాజుకు అభినందనలు తెలియజేస్తున్నారు. కాగా తమ కుమారులను ఎంతగానో ప్రోత్సహించిన క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సత్యనారాయణ, రహీంలకు ఈ సందర్భంగా తండ్రి రమేష్‌రాజు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఏసీఏ కోచ్ సత్తిబాబుతో సత్యనారాయణరాజు (ఫైల్)



తల్లిదండ్రులతో సోదరులు





ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయగోపురాన్ని తాకిన సూర్యకిరణాల దృశ్యాలు

సుదర్శన చక్రంపై సూర్యకిరణాలు

ఆత్రేయపురం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): భానుడు ప్రకాశిస్తున్న వేళ సుదర్శన చక్రంపై సూర్యకిరణాలు ప్రతిబింబించిన దృశ్యాలు అపురూపం. డాక్టర్‌బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ రాజగోపురంపై మంగళవారం భానుడు ఉదయిస్తున్న వేళల్లో గోపురం సుదర్శన చక్రంపై సూర్యకిరణాలు పడుతున్న దృశ్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ దృశ్యాలు భక్తులు సెల్‌ఫోన్లలో బంధించారు.

వైభవంగా లక్ష దీపోత్సవం

● తరలివచ్చిన అశేష భక్తజనం

ఆత్రేయపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలిలో మంగళవారం రాత్రి లక్ష దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో లక్షదీపోత్సవం వైభవంగా నిర్వహించారు. జగన్మోహిని కేశవస్వామి, ఉమాకమండలేశ్వరస్వామి ఆలయాలకు అభిముఖంగా వరుస దీపాలతో అలంకరణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉమాకండలేశ్వరస్వామికి రుద్రాభిషేకం, జగన్మోహిని కేశవస్వామికి పుష్పాభిషేకం నిర్వహించారు. ఆయా ఆలయాలకు అభిముఖంగా వరుస దీపాలతో అలంకరించారు. వివిధ రంగుల దీపాలతో దేవత స్వరూపాల దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులు హరిహరనామం జపిస్తూ దీపాలను వెలిగించారు. శివుడు, కృష్ణుడు, కేశవస్వామి, తదితర రూపాలతో దీపాలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అశేషభక్తజనం భక్తిశ్రద్ధలతో లక్షదీపోత్సవంలో పాల్గొని తన్మయత్వం పొందారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



ర్యాలి జగన్మోహిని కేశవస్వామి- ఉమాకమండలేశ్వరస్వామి ఆలయాల వద్ద లక్షదీపోత్సవం దృశ్యాలు

వైభవంగా కార్తీక దీపారాధన

● ఉష్ట్ర వాహనంపై స్వామివారి నగరోత్సవం ● ఉర్రూతలూగించిన జబర్దస్త్ కళాకారులు



ఉష్ట్రవాహనంపై ఊరేగుతున్న ప్రసన్నాంజనేయుడు

ద్రాక్షారామ, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో 61వ కార్తీకదీపారాధన మహోత్సవం మంగళవారం వైభవోపేతంగా జరిగింది. ఉదయం 6 గంటలకు జుత్తుక చిన్న ఆధ్వర్యంలో ప్రసన్నాంజనేయస్వామికి వేదమంత్రాలతో లక్షతులసి పూజ, తమలపాకుల పూజ జరిపారు. స్వామివారిని పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. లక్షతులసి పూజలో పుణ్యదంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఉష్ట్రవాహనంపై నగరోత్సవం

అనంతరం మధ్యాహ్నం ప్రసన్నాంజేయస్వామి వారికి పుష్పాలంకృతమైన ఉష్ట్ర వాహనంపై మేళతాళాలు, మంగళవాయిద్యాలతో నగరోత్సవం జరిగింది. నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ నగరోత్సవం ప్రారంభించారు. ఉష్ట్రవాహనంపై ప్రసన్నాంజనేయస్వామి ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 4నుంచి 5గంటల వరకు అక్కిరెడ్డి అబ్బు బృందంచే భజన కాలక్షేపం జరిపారు.

జ్యోతిప్రజ్వలన చేసిన ఎమ్మెల్సీ తోట

సాయంత్రం 5.24 గంటలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సూర్యకుమారి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్తీక దీపారాధన ప్రారంభించారు. అఖండ దీపాన్ని తోట దంపతులు వెలిగించారు. అంతకుముందు ప్రసన్నాంజనేయస్వామికి పూజలు జరిపారు. తదుపరి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ప్రారంభించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కార్తీకదీపారాధన మహోత్సవంలో యాంకర్ నందిని వ్యాఖ్యానంతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శన ఆకట్టుకుంది. శుభమ్ ఈవెంట్స్‌చే నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయనీగాయకులు శ్రీలలిత, సత్య, సిద్ధూరాక్‌స్టార్ ఆలపించిన సినీగేయాలు అలరించాయి. జబర్దస్త్ కళాకారులు రైజింగ్‌రాజు, రాజమౌళి, హరిత, దొరబాబులచే హాస్యసన్నివేశాల ప్రదర్శనలు హాస్యపు జల్లు కురిపించాయి. ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు. రాత్రి 12 గంటలకు ఉమాశ్రీ కళానికేతన్‌చే కళాకారులు ప్రదర్శించిన రామాంజనేయ యుద్ధం వార్‌సీను, రాజనర్తకి నాటకం రంగస్థలనాటక ప్రియులు ఆసక్తితో తిలకించారు.



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయకురాలు శ్రీలలిత



ప్రసన్నాంజనేయుడికి పూజలు చేస్తున్న మంత్రి సుభాష్



దీపారాధన ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

బాణసంచా మెరుపులు

కార్యక్రమంలో భాగంగా రాత్రి 10 గంటలకు ఆంజనేయ ఫైర్‌వర్క్స్ దవులూరి శ్రీనివాస్‌చే బాణా సంచా వినియోగం విశేషంగా అలరించింది. వివిధరకాల బాణాసంచా మెరుపులను వీక్షకులను మైమరిపించాయి. రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ పర్యవేక్షణలో సీఐ దొరైరాజు పలువురు ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

సైన్సు మ్యూజియంను సందర్శించిన ఏపీ క్రాఫ్ట్ మెంబర్స్ సెక్రటరీ

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బొమ్మూరులో నూతనంగా నిర్మించిన సైన్సు సెంటర్‌ను మంగళవారం ఏపీ కాస్ట్ మెంబర్ సెక్రటరీ చలపతిరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్సు మ్యూజియం పెండింగ్‌లో ఉన్న పనులన్నీ త్వరగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు నూతన ఆవిష్కరణలు చేయడానికి ఇక్కడ అవకాశం కల్పిస్తామన్నారు. విద్యార్థులు, సామాన్య ప్రజానీకం సైన్సు మ్యూజియంను సందర్శించి ఉత్సాహంగా వినోదభరితంగా గడపవచ్చని అందుకు తగిన సౌకర్యాలు ఉన్నాయని ప్రాజెక్టు కోఆర్డినేటర్ మేకా సుసత్యరేఖ తెలిపారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ కోమలి, కీర్తి, ఫీల్డ్ ఆఫీసర్ దుర్గయ్య టెక్నిషియన్ అజయ్ పాల్గొన్నారు.

అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బర్‌లో కోనం చేపలు

● కార్తీకమాసంతో ధరలేక మత్స్యకారులు డీలా

అంతర్వేది, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కోనసీమ అంబేడ్కర్ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బర్‌లో కోనం చేపలు అధిక సంఖ్యలో లభ్యమయ్యాయి. మత్స్యకారులు పంటపండిన కార్తీక మాసం కావడంతో సరైన గిరాకీ లేకుండాపోయింది. దీంతో కోనం చేపలకు సరైన ధర లేకపోవడంతో మత్స్యకారులు తక్కువ ధరకే విక్రయించారు. గతంలో కిలో రూ.600 నుంచి 700వరకు ఉండేది. ప్రస్తుతం రూ.450కిలో కోనం చేపలు అమ్ముడు పోతున్నాయి. ఈ సీజన్లో ఈ కోనం చేపలు అధికంగా మత్సకారుల వలలో చిక్కుతున్నాయని వారు చెబుతున్నారు.





ప్రధాన ఆలయం వెలుపల దర్శనం కోసం వేచివున్న భక్తులు

రత్నగిరిపై కొనసాగిన రద్దీ

అన్నవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో కార్తీకమాస రద్దీ మంగళవారం కూడా కొనసాగింది. బహుళ ఏకాదశి సందర్భంగా 5,996 వ్రతాలు జరగ్గా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.66 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు వెల్లడించారు. కార్తీకమాసం మరో నాలుగు రోజుల్లో ముగియనుంది. వ్రతాలు మంగళవారం 1.28 లక్షలకు చేరుకోగా కార్తీకం ముగిసేనాటికి మరో 12 వేలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు.



ఉప్పాడ వద్ద సముద్రంలో ఎగసిపడుతున్న అలలు

ఉప్పాడ తీరంలో అలజడి

కొత్తపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. సముద్ర నీటిమట్టం పెరగడంతో అలలు ఉవ్వెత్తున ఎగసి ఉప్పాడ-కాకినాడ బీచ్‌రోడ్డును తాకుతున్నాయి. ఉప్పాడ-అమీనబాద్‌లో నిర్మాణంలో ఉన్న మినీ హార్బర్ ప్రాంతంలో సముద్రం లోపలికి నిర్మించిన గోడలపై నుంచి రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి ఆకాశంలో మబ్బులు ఆవరించాయి. సాయంత్రమయ్యేసరికి గాలుల తీవ్రత పెరిగింది. ఆకాశంలో మబ్బులు, ఈదురు గాలుల తీవ్రతను అంచనా వేసుకున్న మత్స్యకారులు వేట సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

సేవల్లో ప్రథమం



నిర్వహణలో చింతూరు సీహెచ్‌సీకి రాష్ట్రంలో మొదటి స్థానం వరించిన కాయకల్ప అవార్డు రూ.5 లక్షల రివార్డు కూడా...

చింతూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాయకల్ప ప్రోగ్రాం మార్గదర్శకాలు పాటించడంలో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రం రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. కేంద్ర ప్రభుత్వం 2015 మే 15న ప్రవేశపెట్టిన కాయకల్ప ప్రోగ్రామ్‌ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. ఆసుపత్రుల నిర్వహణలో నూతనోత్తేజం నింపడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశం. కేంద్ర, రాష్ట్ర వైద్య నిపుణుల బృందం నిర్దేశిత కాలంలో ఆసుపత్రులను సందర్శించి పనితీరును అనుసరించి అవార్డులు, రివార్డులు ప్రకటిస్తుంది. 2023-24లో రాష్ట్రంలోని 173 సామాజిక ఆరోగ్య కేంద్రాలకు నిర్వహించింది. రోగుల సంతృప్తి, మెరుగైన వైద్య సేవలు, పారిశుద్ధ్యం అంశాల్లో చింతూరు సీహెచ్‌సీ 97.86 మార్కులు సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచినట్టు రాష్ట్ర పభుత్వం మంగళవారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రోత్సాహంగా రూ.5 లక్షల రివార్డును ప్రకటించింది. అవార్డు దక్కించుకున్న చింతూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డిని సహచర వైద్యులు అభినందించారు.



సూపరింటెండెంట్ కోటిరెడ్డికి అభినందనలు తెలుపుతున్న సహచర వైద్యులు

భర్త రిటైర్మెంట్ సొమ్ము కోసం

భార్యల గొడవ

రెండో భార్య ఇంటి ముందు మొదటి భార్య నిరసన



రెండో భార్య ఇంటి ముందు ఆందోళనకు దిగిన మొదటి భార్య, పిల్లలు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భర్త రిటైర్మెంట్ సొమ్ము కోసం ఇద్దరు భార్యల మధ్య గొడవ జరిగింది. రెండో భార్య ఇంటి ఎదుట మొదటి భార్య పిల్లలతో కలిసి నిరసనకు దిగిన సంఘటన కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి... బత్తిన అప్పారావు అనే వ్యక్తి చేబ్రోలు లో సెరికల్చర్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తూ గత ఏడాది ఉద్యోగ విరమణ చేశాడు. రిటైర్మెంట్ సొమ్ము రూ.38లక్షలు రావాల్సి ఉంది. కాగా అప్పారావు తొలుత లక్ష్మిని, తర్వాత ఆయన చేస్తున్న కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ రాజేశ్వరిని రెండో పెళ్లి చేసుకున్నాడు. కాగా రావాల్సిన సొమ్ము కోసం రెండు కుటుంబాల మధ్య ఏడాదిగా వివాదం జరుగుతోంది. పెద్దల మధ్య పెట్టినా సమస్య పరిష్కారం కాలేదు. రిటైర్మెంట్ సొమ్ము తమకే కావాలని, తండ్రిని తమకు అప్పగించాలని మొదటి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు రెండో భార్య రాజేశ్వరి పని చేస్తున్న కార్యాలయానికి వెళ్లి వాగ్వాదానికి దిగారు.

అనంతరం రాజేశ్వరి ఇంటికి వెళ్లి టెంట్ వేసి నిరసనకు దిగారు. మరోపక్క రెండో భార్య రాజేశ్వరి, భర్త అప్పారావు కలిసి గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌కు వెళ్లి మొదటి భార్య, ఆమె ఇద్దరు పిల్లలు దాడి చేశారని ఫిర్యాదు చేశాడు. అప్పారావు తన మోటారు సైకిల్ తీసుకెళ్లిపోయారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదనపు ఎస్ఐ లక్ష్మణస్వామి కేసు విచారిస్తున్నారు.



నీలకంఠేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న విధు శేఖర భారతీ మహాస్వామి, భక్తులకు అనుగ్రహభాషణ

భగవత్ సంకల్పంతోనే కార్య సిద్ధి

శృంగేరీ పీఠాధిపతి విధు శేఖర భారతీ మహాస్వామి
అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి దర్శనం
నరసింహ జయంతి కైంకర్యాలకు రూ.1,11,116 విరాళం

అంతర్వేది, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భగవంతుని సంకల్పంతోనే ప్రతీ కార్యం సిద్ధిస్తుందని శృంగేరీ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి అన్నారు. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న అంతర్వేది పుణ్యక్షేత్రానికి మంగళవారం ఆయన విచ్చేశారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఆలయ అధికారులు, అర్చకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అంతర్వేది సముద్ర తీరంలో పుణ్యస్నానం ఆచరించిన స్వామి తొలి దర్శనంగా క్షేత్రపాలకుడు నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసి పురాతన కట్టడమైన శివాలయం, ధ్వజస్తంభం, బ్రిటీష కాలం నాటి నందీశ్వరుడిని పరిశీలించారు. నీలకంఠేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆలయ పునర్నిర్మాణం గురించి అర్చకులు, సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ స్వామీజీకి వివరించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకున్న మహాస్వామికి వేద పండితులు, అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ చేస్తూ ప్రాకార మండపంలో ఉన్న దేవతలను దర్శించుకుంటూ ఆలయ ప్రాకారం, గోపురాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిష్యులతో కలిసి అంతరాలయంలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టత, చరిత్రలను అర్చకులు వివరించారు. రాజ్యలక్ష్మి అమ్మవారిని దర్శించారు. ఆలయ అభివృద్ధి, భక్తుల కోసం నిర్మించబోయే అన్నదాన భవనం, కోనేరు, మాస్టర్‌ప్లాన్ గురించి అధికారులు, అర్చకులను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. మానవుని మనసులో ఏముందో, వారు చేసే పనుల్లో తప్పు ఒప్పులను మరొకరు తెలుసుకోవడం కష్టమే కానీ భగవంతుడు సర్వలోకాన్ని క్షణాల్లో తెలుసుకుంటాడన్నారు.సంకల్పం గొప్పదైతే ఏ కార్యాన్నైనా జయించడానికి భగవంతుడు మీ వెంటే ఉంటాడన్నారు. దైవ కార్యాల్లో పాల్గొనడం ప్రతి ఒక్కరి వల్ల కాదని, భగవంతుడు అనుగ్రహిస్తేనే తప్ప దైవ దర్శనం జరగదన్నారు. పశ్చిమ ముఖ దిశగా దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటూ మీకు ఆశీస్సులు అందజేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మం వైపు నడుచుకుంటూ ఆధ్యాత్మిక భావాలను అలవరచుకోవాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి అనుగ్రహభాషణతో పులకించిపోయారు. అనంతరం భారతీమహాస్వామికి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆలయ అభివృద్ధి, పురాతన కట్టడాల గురించి వివరించారు. రాజోలు నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిఫార్సు చేయాలని కోరారు. లక్ష్మీనరసింహస్వామి జయంతికి కైంకర్యాల కోసం రూ.1,11,116 విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించారు.

కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, ఛైర్మన్ రాజా కలిదిండి కుమారరామగోపాలరాజా బహదూర్, దేవదాయ శాఖ తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు (పెద్దకాపు), ఎంపీటీసీ భైరా నాగరాజు, పోతురాజు కృష్ణ, బర్రే శ్రీను, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం భారతి మహాస్వామి తిరుగు ప్రయాణంలో గుడిమెళ్లంక అల్లూరి విశ్వనాథరాజు నివాసం, వేణుగోపాలస్వామి, కనకదుర్గమ్మ ఆలయాలను దర్శించి పాలకొల్లు శంకర మఠానికి వెళ్లారు. సాయంత్రం చంద్రమౌళీశ్వర పూజ, అనంతరం భక్తులు పాద పూజ చేసి వస్త్రాలు, కానుకలు సమర్పించారు. అనంతరం రాజమహేంద్రవరం పయనమయ్యారు.



అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విధు శేఖర భారతీ మహాస్వామి, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌తో మాట్లాడుతున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ముగ్గురికి తీవ్ర గాయాలు... పిఠాపురం బైపాస్‌లో ఘటన

పిఠాపురం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి చెందిన పెట్ల దుర్గాప్రసాద్ (22) బంగారం పని చేస్తుంటాడు. మంగళవారం ఆయన భార్య సమత, తల్లి సాయికుమారి, రెండేళ్ల పాపతో కలిసి మోటారు సైకిల్‌పై గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా పిఠాపురం జాతీయ రహదారి సీతయ్యగారి తోట సమీపంలో ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొన్నాడు. దాంతో కిందపడిపోయిన దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన ముగ్గురినీ తొలుత పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. పట్టణ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బైపాస్ రోడ్డులో ప్రమాద స్థలిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వైద్యం వికటించా! గుండెపోటా!

ప్రైవేట్ ఆసుపత్రిలో ఆపరేషన్‌కు వెళ్లిన వ్యక్తి మృతిపై పలు అనుమానాలు

గండేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముక్కు శస్త్ర చికిత్స కోసం ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లిన వ్యక్తి కొన్ని నిమిషాల్లోనే మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామ శివారున ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. జగ్గంపేట మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన చింతల శ్రీను (40) ఈ నెల 21న రాజపూడి వద్ద బైక్ ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. దీంతో అతడిని నీలాద్రిరావుపేట గ్రామ శివారున ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అయితే ముక్కుకి గట్టి దెబ్బ తగలడంతో అక్కడి వైద్యులు శస్త్ర చికిత్స అవసరమని చెప్పారు. అప్పటి నుంచి అదిగో ఇదిగో అంటూ మంగళవారం ఆపరేషన్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో శ్రీనును ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లి మత్తు ఇవ్వగా కొద్దిసేపటికే మృతిచెందినట్టు సమాచారం. సాయంత్రం ఆసుపత్రి సిబ్బందిని శ్రీను బంధువులు ఆపరేషన్ ఏమైందని అడగ్గా గుండెపోటుతో మృతి చెందినట్టు తెలిపారు. దీంతో శ్రీను కుటుంబీకులు ఒక్కసారిగా కుప్పకూలారు. ప్రమాదం జరిగి ఆసుపత్రిలో చేరినప్పటి నుంచి కూడా శ్రీను బాగానే ఉన్నప్పటికీ ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లగానే చనిపోవడంపై స్థానికులు పలు ఆరోపణలు చేశారు. వైద్యం వికటించిందా... లేక నిజంగానే గుండెపోటు వచ్చిందా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఆసుపత్రి యాజమాన్యం వివరణ కోరడానికి ప్రయత్నించగా ఎవరూ అందుబాటులో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.



ఆసుపత్రిలో రోదిస్తున్న బంధువులు, ఇన్‌సెట్‌లో మృతుడు శ్రీను పాత చిత్రం

రోడ్డు ప్రమాదంలో ఒడిశా వాసి మృతి

శంఖవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కత్తిపూడి శివారు సీతంపేట 16వ నెంబరు రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఒడిశాకు చెందిన జన సురేష్‌కుమార్ (32) మృతి చెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రం రాయగడకు చెందిన కుమార్ ఒడిశా నుంచి రాజమహేంద్రవరం వైపు లారీ నడుపుకుంటూ వెళ్తున్నాడు. కత్తిపూడి సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో లారీ నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురేష్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీహరిబాబు

నేడు త్రినాథరావు బాధ్యతల స్వీకారం

అన్నవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలపై నియమితులైన వేంద్ర త్రినాథరావు బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం పది గంటలకు రామచంద్ర మోహన్‌కు వీడ్కోలు సభ ఏర్పాటు చేసినట్టు దేవస్థానం ఉద్యోగుల సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది.

రైతు కూలీ, ఏజెన్సీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో

మహా ధర్నా



ఐటీడీఏ గేటు ఎదుట ధర్నా చేస్తున్న రైతు కూలీ, గిరిజన సంఘాల నాయకులు

రంపచోడవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు, కార్మికులు, పోలవరం నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలపై రైతు కూలీ, ఏజెన్సీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన మహా ధర్నా విజయవంతమైంది. రంపచోడవరం ప్రధాన కూడలిలో మానవహారం జరిపి భారీ ప్రదర్శనతో ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాలను ముట్టడించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహాయ కార్యదర్శి వంజం జోగారావు, గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తాటి బుల్లబ్బాయి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. బడా కార్పొరేట్లకు కోట్లాది రూపాయలు మాఫీ చేస్తున్న ప్రభుత్వాలు రైతు రుణాల మాఫీలో అలసత్వం వహిస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం పోలవరం నిర్వాసితుల సమస్యలను పట్టించుకోవట్లేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలన్నారు. ఆదివాసీ అటవీ హక్కులను పరిరక్షించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీవేజ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. ఉపాధి హామీ పథకం పని దినాలను 200 వందల రోజులకు పెంచాలన్నారు. రైతు కూలీ, ఏజెన్సీ గిరిజన సంఘాల నాయకులు ఈ.రాంబాబు, కె.రామిరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల పనితీరు
మెరుగుపరుచుకోవాలి: జేసీ


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురంటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగుల పనితీరును మెరుగుపరుచుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రెవెన్యూ ఉద్యోగులతో తొలిసారిగా జేసీ అధ్యక్షతన సెక్షన్ల వారీగా పనితీరుపై ఆమె సమీక్షించారు. సెక్షన్ అధికారులు ప్రతీ ఒక్కరికీ రోజువారీగా విధులు కేటాయిస్తూ సాయంత్రం వాటిని ఏ మేరకు పూర్తిచేసింది నివేదిక రూపంలో ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం కొందరు సిబ్బంది పైనే పనిభారం, ఒత్తిడి ఉంటుందని, మరికొందరు విధుల పట్ల అలసత్వం వహిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. అందరికీ సమాన ప్రాతిపదికన విధులు కేటాయిస్తూ పనితీరును మెరుగు పరుచుకోవాలని సెక్షన్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇకపై 15 రోజులకొకసారి సిబ్బందితో సమావేశాలు నిర్వహిస్తానని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి మదన్మోహనరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.కాశీవిశ్వేశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్లు మురళీకృష్ణ, బోసుబాబు, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, భరత్, రవితేజ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా
కలెక్టరేట్ ఎదుట మహాధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాలు

అమలాపురంటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట వివిధ కార్మికసంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నూకల బలరామ్, గుదే దుర్గాప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షతన ధర్నా జరిగింది. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఏఐటీయూసీ పూర్వపు జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు, వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రరావు, ఆశవర్కర్ల జిల్లా కార్యదర్శి సుభాషిణి పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


ఎస్‌బీఐ రీజనల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు సరికొత్త రీతిలో ప్రజలను మోసం చేస్తున్నారని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు పేర్కొన్నారు. సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండడం ద్వారా వాటి బారిన నుంచి తప్పించుకోవచ్చునన్నారు. అమలాపురం యెండూరి కన్వెన్షన్ హాలులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ బిజినెస్ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సుకు ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సైబర్ నేరాలను నియంత్రించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. స్టేట్‌బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఎంవీవీ కృష్ణ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులకు ఎవరైనా ఫోన్ చేసినప్పుడు వ్యక్తిగత సమాచారం ఇవ్వకూడదని, ఏదైనా అనుమానం కలిగితే వెంటనే 1930 నంబరుకు కాల్ చేయాలని సూచించారు.

ఎల్ఐసీ ఏవోఐ నూతన కార్యవర్గం ఎన్నిక


అమలాపురంలో ఎన్నికైన ఎల్ఐసీ ఏవోఐ నూతన కార్యవర్గం

అమలాపురం టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అమలాపురం మేధా గార్డెన్స్‌లో ఎల్ఐసీ ఏవోఐ సమావేశం మంగళవారం నిర్వహించారు. సౌత్ సెంట్రల్‌జోన్ ప్రధాన కార్యదర్శి పీఎల్ నరసింహారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీలో తీసుకువచ్చిన నూతన మార్పుల వల్ల ఏజెంట్స్ వ్యవస్థకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు డిసెంబరు 10న రాజమహేంద్రవరం డివిజన్‌లోను, ఫిబ్రవరి 11న పార్లమెంటు భవనం వద్ద చేపట్టిన ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అమలాపురం బ్రాంచి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సానబోయిన వీరభద్రరావు, కార్యదర్శిగా ఎన్.వినాయకరావు, కోశాధికారిగా దొమ్మేటి శివస్వామి, ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులతో పాటు 19 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవికిశోర్, డివిజన్ ప్రెసిడెంట్ వై.విజేశ్వరరావుల ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహించారు.

'మనం మన రాజ్యాంగం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మునిస్వామి

యానాం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): యానాంకు చెందిన ప్రముఖకవి కళామామణి పోనుగుమట్ల విష్ణుమూర్తి రచించిన మనం మన రాజ్యాంగం పుస్తకాన్ని యానాం పరిపాలనాధికారి ఆవిష్కరించారు. మంగళవారం ఉదయం పరిపాలనాధికారి చాంబర్‌లో ఆర్ఏ మునిస్వామి ఆవిష్కరించారు. ఈ పుస్తకానికి ముందుమాట రాసిన కవి కథకుడు దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ విషయ సేకరణచేసి శ్రమపడి ఎంతో సరళంగా రాసిన రచయితను అభినందించారు. కార్యక్రమంలో కేవీవీ వీరస్వామి, ముర్రే మీరా సాహెబ్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీతో తిరిగి ఇచ్చేశారు

మామిడికుదురు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంక జిల్లాపరిషత్ హైస్కూలులో చదువుతున్న విద్యార్థులు నిజాయితీతో తమకు దొరికిన బ్రాస్‌లెట్‌ను పోగొట్టుకున్న రేకపల్లి బాబికి తిరిగి ఇచ్చి తమ నిజాయితీని చాటుకున్నారు. స్కూలులో 7వ తరగతి చదువుతున్న హర్షశ్రీసాయి వినయ్, ఆనంద్‌లకు దొరికిన రూ.1.30లక్షల విలువచేసే బ్రాస్‌లెట్‌ను పోగొట్టుకున్న రేకపల్లి బాబికి మంగళవారం అందించారు. నిజాయితీ చాటుకున్న ఒక్కొక్క విద్యార్థికి బాబి రూ.10వేలు చొప్పున నగదు బహుమతులను అందించారు. నిజాయితీ చాటుకున్న విద్యార్థులను సర్పంచ్ సుందరనీడి రాజేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు హరినాథ్, సలాది దొరబాబు అభినందించారు.

యానాం సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాస్

యానాం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): యానాం స్త్రీశిశు సంక్షేమశాఖలో అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రెయ్యిశ్రీనివాస్‌ను యానాం సబ్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ అండర్ సెక్రటరీ జైశంకర్ ఉత్తర్వులు జారీచేశారు. మరో రెండురోజుల్లో శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటివరకు పనిచేసిన నరేంద్రకుమార్‌ను వ్యవసాయశాఖకు బదిలీచేశారు.

రైతులకు కొండంత అండగా ఉపాధి పథకం

ఉప్పలగుప్తం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రైతులకు కొండంత అండగా ఉందని డ్వామా ఏపీడీ పి.రాంబాబు అన్నారు. మంగళవారం ఆయన మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను, భీమనపల్లిలో నిర్మాణం పూర్తయిన గోకులం షెడ్డును, సన్నవిల్లిలో రైతులు కొబ్బరి చెట్లకు ఎరువులు వేసుకునేందుకు వీలుగా ఉపాధి కూలీలు తవ్వుతున్న కందకాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఎన్.కొత్తపల్లిలో ఉపాధి మస్తర్లను తనిఖీచేశారు.

మద్యం బెల్టు షాపుల నిర్వాహకుల అరెస్టు

ఉప్పలగుప్తం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు నడుపుతున్న పరమట వెంకటేశ్వరరావు, కడలి శ్రీనివాసరావు, చిక్కం రాంబాబు, లంకే శ్రీనివాసనాగవర్మ, రేలంగి వెంకటేశ్వరరావును మంగళవారం అరెస్టు చేసి ఉప్పలగుప్తం తహసీల్దార్ కోర్టులో హాజరు పరిచినట్టు ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. తహసీల్దార్ వాసా దివాకర్ వారిని బైండోవర్ చేసి, ఒక్కక్కరికి లక్ష రూపాయల పూచీకత్తుతో విడుదల చేసినట్టు తెలిపారు.

ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ కీలకం

ముమ్మిడివరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ అనేది మూలస్తానం వంటిదని స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఏకీకృత న్యాయవ్యవస్థ అని ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మహ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లా డే సందర్భంగా మండలంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. న్యాయ సంస్థ చట్టసభలు చేసే శాసనాలను రాజ్యాంగం ద్వారా నడుస్తున్నాయా లేదా అని చూసే బాధ్యత న్యాయస్థానాలపై ఉందన్నారు. అనంతరం న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులతో రాజ్యాంగ పీఠికను చదివి వారందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

రాజ్యాంగంపై
అవగాహన పెంచుకోవాలి


ఐ.పోలవరం మండలం మురమళ్లలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ఐ.పోలవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం పట్ల ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మురమళ్ల క్యాంపు కార్యాలయంవద్ద జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు అధ్యక్షతన మంగళవారం రాజ్యాంగ దినోత్సవం జరుపుకున్నారు. ఎమ్మెల్యే బుచ్చిబాబు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. గుత్తుల సాయి, సాగిరాజు సూరిబాబురాజు, తోటకూర సుబ్బరాజు, వాడ్రేవు వీరబాబు, నడింపల్లి శ్రీనురాజు, బొంతు శ్రీరాములు, పచ్చిమాల దాసు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో పౌరులందరికీ సమానత్వం

పి.గన్నవరం: భారత రాజ్యాంగం అన్నిరంగాలలో పౌరులందరికీ సమానత్వం కల్పించిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన భారత రాజ్యాంగ సమర్పణ దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదే విధంగా విద్యార్థులు, అధికారులు రాజ్యాంగ పీఠికను ఆలపించి ప్రతిజ్ఞ చేశారు. పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో మాలల జేఏసీ నాయకులు కోట రామమోహనరావు ఆధ్వ ర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ పీఠిక ఆలపించి ప్రతిజ్ఞ చేశారు. అదేవిధంగా పి.గన్నవరం లక్ష్మీఐటీఐ కళాశాలలో స్నేహా యువ కేంద్రం ఆధ్వర్యంలో కళాశాల డైరెక్టర్ రవిచంద్ర నేతృత్వంలో ర్యాలీ నిర్వహిచారు. ఆయా కార్యక్రమాలలో తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీవో కేవీ ప్రసాద్, నక్కా వెంకటేశ్వరావు, కోట విజయభాస్కర్, కోట శ్రీను, దాసరి కాశి, మట్టా శ్రీను పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి: ఎమ్మెల్యే దేవ

మలికిపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మలికిపురంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు (పెద్దకాపు), పోతురాజు కృష్ణ, పిండి సత్యనారాయణ పాల్గొన్నారు.

'అంబేడ్కర్ స్ఫూర్తితో పయనించాలి'

అంబాజీపేట: ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని అంబాజీపేట, కె.పెదపూడి, పుల్లేటికుర్రు తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్‌లు నాగాబత్తుల శాంతకుమారి, జల్లి బాలరా జు, నాయకులు నాగ

రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు

వరపు నాగరాజు, పులిదిండి వీరవెంకట సత్యనారాయణ, నూకపెయ్యి చిన్న, నాగాబత్తుల నరసింహమూర్తి, ముత్తాబత్తుల ప్రశాంత్, నెల్లి వెంకటరమణ, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, దొమ్మేటి సత్యమోహన్, బాబులు పాల్గొన్నారు.

మామిడికుదురు: రాజ్యాంగ దినోత్సవాన్ని మామిడికుదురు సెంటర్‌లో వివిధ దళిత సంఘాల నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండు కూడలిలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భూపతి వెంకటపతి, కలిగితి పల్లంరాజు, బొంతు మణిరాజు, నెల్లి దుర్గాప్రసాద్, కుసుమ పెరుమాళ్ కుమార్, కొనుకు నాగరాజు, చిక్కం బుజ్జిబాబు, చిగురుపాటి పెద్దిరాజు, నీతిపూడి మహేష్ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరంలో షెడ్యూల్డు కులాల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. మట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పోలమ్మచెరువుగట్టున ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనిపల్లి సత్యనారాయణ, కాశి వెంకటాచార్య జనిపల్లి బాలకృష్ణ, పెట్టా శివ, కాశి అప్పారావు, నక్కా శ్రీనివాస్, జె.భైరవస్వామి, డి.బాబూరావు, పలువురు పాల్గొన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ పీవీ నూకరాజు, ఏఈ పీవీ సుధాకర్, టీపీవో రాజేష్‌బాబు, ఆర్ఐ భాస్కరరావు, హెల్త్ అసిస్టెంట్ జె.సత్యనారాయణరాజు, జేఏవో రామకృష్ణ, సీఎంఎం భాస్కర్, సీవో రాజేశ్వరి, ఆర్పీలు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే భారత రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరంలోని అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో ఆర్పీఐ జిల్లా అధ్యక్షుడు గిడ్డి జ్ఞానప్రకాష్ అధ్యక్షతన జరిగిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో దడాల రామకృష్ణ, బండి కులకర్ణి, చీకురుమెల్లి శ్రీనివాస్, పంతగడ నరసింహమూర్తి, కె.వెంకటరమణ, యలమంచిలి సురేష్, పరమట యశ్వంత్, దేవరపల్లి ఏడుకొండలు, బుడితి నాగేశ్వరరావు, అయితాబత్తుల సురేష్, కేవీ రావు, ఇసుకపట్ల శివలతో పాటు పలువురు పాల్గొన్నారు.

రాజోలు: మండలంలో ఆయా గ్రామాల్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాట్రేనిపాడు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎత్రిమూర్తులు, రాజోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారి ఎంవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో, తాటిపాకలో దళిత చైతన్యవేదిక ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, రాజోలు వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు మాట్లాడుతూ ప్రపంచంలోని అతిపెద్ద రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బ్యాంకుల మేనేజర్లు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శనీయుడని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు అన్నారు. గోడి పంచాయతీ వద్ద సర్పంచ్ తోట శ్రీదేవి అధ్యక్షతన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే గోడిలో తన నివాసం వద్ద ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. బోడసకుర్రు, మొగళ్లమూరు, గోడిలంక, ఓడలరేవు బీవీసీ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలు జరిగాయి. బోనం కనకయ్య, బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపాల్ డి.మహేశ్వర్, ఈఎస్వీ సుబ్రహ్మణ్యం, శెట్టిబత్తుల తులసీదుర్గారావు, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, కాంగ్రేగుల వాణిఅచ్యుతం, ముత్యాల బాబీ, రొక్కాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాట్రేనికోన: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. లక్ష్మివాడలో జరిగిన కార్యక్రమంలో చీకురుమెల్లి చక్రధర్, చొల్లంగి వెంకటేశ్వరరావు, పరమట తరుణ్‌కుమార్, కుంచే సర్వేశ్వరరావు, కుంచే రాజు, బడుగు శ్రీనివాసరావు, పినిపే విజయప్రకాష్, చీకురుమెల్లి భీమారావు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఎన్.కొత్తపల్లి కొబ్బరిపేటలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చిట్టికుమారిచిన్నా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కొంకి వెంకటబాబ్జి, నల్లా సింహాద్రి, మాదే శ్రీనివాస్, గోసంగి శ్రీను, కొంకి బాలకృష్ణ పాల్గొన్నారు. గొల్లవిల్లిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గాచిన్ని, ఉపాధి ఏపీడీ పి.రాంబాబు, ఎంపీడీవో రాజ్‌కుమార్, ఏపీవో రాజామణి, పంచాయతీ కార్యదర్శి అడబాల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

అంతర్వేది: తెలుగుదేశం పార్టీ రాజోలు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోనిపాటి రాజు అధ్యక్షతన సఖినేటిపల్లి ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఉండ్రాజవరపు బాబూరావు ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని సఖినేటిపల్లి మండల ప్రధాన కార్యదర్శి తాడి సత్యనారాయణ ఇంటి వద్ద మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా శెట్టిబలిజ సాధికార కమిటీ సభ్యుడు కౌరు శ్రీను, కడలి వెంకటరత్నం, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యానాం: స్థానిక పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఎస్సీ నాయకులు పోనుగుమట్ల విష్ణుమూర్తి, గిడ్డి బలరా, పండు సిద్దార్థకుమార్, సక్కువాసుదేవరావు, కోరుకొండ ప్రసాదరావు, సబ్బతి శ్రీనివాస్, మెల్లం శ్రీనివాస్ తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ విజ్ఞానభవన్‌లో యానాం పరిపాలనాధికారి మునిస్వామి ఇతర అధికారులు నివాళులర్పించారు. యానాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న తాతపూడి ముత్యాలు ఇటీవల ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన నేపథ్యంలో ఘనంగా సత్కరించారు.

ఆర్పీఐ ఆధ్వర్యంలో

అమలాపురం టౌన్: భారత రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభకు ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్, విశ్రాంత ప్రాసిక్యూషన్ డైరెక్టర్ ఐఎస్ మల్లేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, జంగా బాబూరావు, జగడం సత్యనారాయణ, ములపర్తి సత్యనారాయణ, కాశి రాంబోధి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉండ్రు శ్యామలారావు, రేవు తిరుపతిరావు, అయితాబత్తుల సుభాషిణి, గోసంగి ఆనందరావు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం..

మనువాద మతోన్మాదుల చెర నుంచి భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా పలువురు ప్రతినబూనారు. కలెక్టరేట్ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ మనువాద మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేష్, ఊటాల వెంకటేష్, పొలమూరి శ్రీనివాసరావు, బండి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పి.గన్నవరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ


రాజోలులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న దేవ వరప్రసాద్


గడియారస్తంభం సెంటర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్పీఐ నాయకులు

బోడసకుర్రులో జోరుగా ఇసుక అక్రమ రవాణా

అల్లవరం, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకపోయిన వైనతేయ నదిలో అక్రమంగా ఇసుక తీసి జోరుగా అమ్మకాలు సాగిస్తున్నారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో వైనతేయ నదిలో ఇసుకను తీసి పడవల ద్వారా తరలించి ట్రాక్టర్లపై ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గడిచిన 25రోజులుగా బోడసకుర్రు శివాలయం పక్కన తూర్పువైపు రోడ్డులో పడవల ద్వారా ఇసుకను ట్రాక్టర్లలో నింపి పలువురు అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. బోడసుకుర్రులో ఇసుక తవ్వకాలపై పోలీస్ అధికారులతో మాట్లాడానని అక్రమంగా తరలిస్తున్నట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటానని తహశీల్దారు వీవీఎల్ నరసింహారావు చెప్పారు. తెల్లవారుజాము, రాత్రి సమయాలలో ఇసుక అక్రమవ్యాపారం జోరుగాసాగుతోంది.

ఆక్వా రైతుల సమావేశం

అంతర్వేది, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో ఆక్వా రైతుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సమావేశానికి మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు ఎం.శ్రీనివాసరావు, ఎస్సీ చంద్రశేఖర్ విచ్చేశారు. ఎన్ఏసీసీఏ సొసైటీ రొయ్యల ఆక్వా రైతులకు ఏఎమ్మార్ ప్రాముఖ్యంపై అవగాహన కల్పించడానికి, మంచి ఆక్వాకల్చర్ మేనేజ్‌మెంట్ పద్ధతిని అమలు చేయడానికి తీరప్రాంత రాష్ట్రాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారని చెప్పారు. కాకినాడ జేటీవో వై.బంగారమ్మ రైతులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో కె.లావణ్య, కె.శ్రావణి, పి.సునీల్‌కుమార్, ఎల్.రాజేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ టీడీపీ నాయకుడు వీర్రాజు మృతి

అమలాపురం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు బళ్ల వీర్రాజు(65) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. బండారులంకకు చెందిన వీర్రాజు టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి వీరవిధేయునిగా ఉంటూ ఎన్నో సేవలు అందించారు. వీర్రాజు మృతికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఎంపీ గంటి హరీష్‌మాధుర్, మెట్ల రమణబాబు, అల్లాడ సోంబాబు, మల్లుల పోలయ్య, చింతా శంకరమూర్తి, పిచ్చిక శ్యామ్, సర్పంచ్ పెనుమాల సునీత, మాజీ ఎంపీటీసీలు మాడా మాధవి, ఆశపు చిన్ని, బడుగు సత్యనారాయణ తదితరులు తీవ్ర సంతాపం తెలిపారు.

కుండలేశ్వరుడికి లక్షబిల్వార్చన


కుండలేశ్వరునికి లక్షపత్రిపూజ దృశ్యం

కాట్రేనికోన, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరంలో మంగళవారం పార్వతీకుండలేశ్వర స్వామికి లక్షబిల్వార్చన జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రముఖ వేదపండితుడు కాళ్ళకూరి దుర్గాప్రసాద్ ఆచార్యత్వంలో 15మంది రుత్విక్కులు పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

కుండలేశ్వరంలో భక్తుల పూజలు

మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు కుండలేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వృద్ధ గౌతమినదిలో స్నానాలాచరించి గోదావరి మాతను పూజించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు కుండలేశ్వరుని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో కృష్ణాజిల్లా జగ్గయ్యపేటకు చెందిన ఉయ్యూరి సుబ్బారావు, స్థానిక గంగుమళ్ళ కిరణ్, పవన్ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో 3000 మంది భోజనాలు చేశారు. ఎస్ఐ అవినాష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈవో కె.గంగాధర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. కార్యక్రమంలో త్సవటపల్లి నాగు, గోకరకొండ సత్తిబాబు, గంగుమళ్ళ భాను, మీసాల నాగబాబు, అక్కల నాగమందేశ్వరరావు, పీఎస్ఎన్ రాజు, మీసాల పూర్ణ, మీసాల నాగబుల్లియ్య, గంగుమళ్ళ కిరణ్, మోటిపల్లి శ్రీను, సలాది సతీష్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష బిల్వార్చన

అమలాపురం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకోదండరామ కాపు యువజన సంఘం ఆధ్వర్యంలో గున్నేపల్లి అగ్రహారంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత రామేశ్వరస్వామివారికి మంగళవారం లక్ష బిల్వార్చన వైభవంగా నిర్వహించారు. తొలుత గణపతిపూజ, లింగార్చన, జ్యోతిర్లింగార్చన, అనంతరం లక్ష బిల్వార్చన నిర్వహించారు. స్వామివారికి శాంతి కల్యాణం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అలంకార శోభితుడైన రామేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సర్పంచ్ పెద్దిరెడ్డి రాము, వాకపల్లి కాశి, నాగబాబు, పెద్దిరెడ్డి రమణ, ప్రసాద్ పాల్గొన్నారు.

కేశవస్వామి ఆలయంలో దీపాలంకరణ

పి.గన్నవరం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): మానేపల్లి గ్రామంలో ఉన్న శ్రీ కేశవస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ మహిళావిభాగం ఆధ్వర్యంలో సహస్ర దీపాలంకరణ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యేను కలిసిన పెదబాబు

అంబాజీపేట, నవంబరు26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన బొంతు గంగాధర్(పెదబాబు) పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యేకు పెదబాబు పుష్పగుచ్ఛాన్ని అందించి కృతజ్ఞతలు తెలిపారు.

'రైతులు వరి పంట కోతలు వాయిదా వేసుకోవాలి'

రాజోలు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా రాబోయే నాలుగైదు రోజుల వరకు అధిక వర్ష సూచన ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపిన కారణంగా రైతులు వరి పంట కోతలను వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బోసుబాబు సూచించారు. చింతలపల్లిలో రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసిన పనలను సురక్షిత ప్రాంతాలకు చేర్చుకోవాలని, తడిసిన పనలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలన్నారు. రబీలో వేసే పంట రకాల గురించి ఆయన వివరించారు. మట్టి నమూనా పత్రాలను రైతులకు అందజేసి వివరించారు. ధాన్యం కొనుగోలు గురించి రైతులను పలు వివరాలు అడిగి వాట్సాప్ షెడ్యూలు గురించి అవగాహన కల్పించారు. రైతులు తమకు నచ్చిన మిల్లునకు ధాన్యం రవాణా చేసుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

29న శతసహస్ర పంచముఖి రుద్రాక్షపూజ

అమలాపురం టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అమలాపురం రవణం వీధిలో వేంచేసి ఉన్న శ్రీసర్వమంగళ రామలింగేశ్వర ప్రసన్నాంజనేయ షిర్డీ సాయి స్వామివార్ల ఆలయంలో ఈ నెల 29న మాసశివరాత్రి మహాపర్వదినాన్ని పురస్కరించుకుని కాశీ క్షేత్రం నుంచి తీసుకువచ్చిన పంచముఖి రుద్రాక్షలతో 24వ శతసహస్ర పంచముఖి రుద్రాక్షపూజ నిర్వహించనున్నట్టు దేవస్థానం అనువంశిక ధర్మకర్త మాచిరాజు రవికుమార్ తెలిపారు. అదేరోజున ఉదయం ఆలయ ప్రాంగణంలో నిర్మించిన రాజగోపురాన్ని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభిస్తారు. అనంతరం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు రామలింగేశ్వరస్వామికి 24వ శతసహస్ర పంచముఖి రుద్రాక్షపూజను ప్రారంభిస్తారు. సర్వమంగళాదేవికి శతసహస్ర కుంకుమార్చన, మోక్ష గణపతికి గరికపూజ, సాయినాథునికి లక్ష బిల్వార్చన, ప్రసన్నాంజనేయస్వామికి సింధూరనాగవల్లీ దళ పూజలను అల్లవరపు సుబ్రహ్మణ్యదీక్షితావధాని ఆచార్య బ్రహ్మత్వంలో 22 మంది రుత్వికులతో నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ మాచిరాజు రవికుమార్, వాడ్రేవు శ్రీనివాసరావు, కాళ్లకూరి నాగవెంకటభూషణం, మాచిరాజు సాయికృష్ణశ్రవణ్, జానకోట అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటంలో
భాగస్వాములు కావాలి

అమలాపురంరూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో మాలలంతా సిద్ధం కావాలని పీవీ రావు స్థాపించిన మాలమహానాడు ఆధ్వర్యంలో పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఈదరపల్లి అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో మాలమహానాడు జిల్లాశాఖ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పండు అశోక్‌కుమార్, ఎంఏకే భీమారావు, పెయ్యల పరశురాముడు, ఐఎస్ మల్లేశ్వరరావు, జగడం సత్యనారాయణ, అయితాబత్తుల సుభాషిణి, పుణ్యమంతుల రజనీ, జల్లి శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. గుంటూరులో మాలసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరిగే మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాశి వెంకట్రావు, కొంకి రాజామణి, రేవు శ్రీను, నక్కా సంపత్‌కుమార్, పోతుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లాలమ్మను దర్శించుకున్న విధుశేఖర భారతీ మహాస్వామి

కొత్తపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం వానపల్లి గ్రామదేవత పల్లాలమ్మ అమ్మవారిని, గ్రామంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామిని విధుశేఖర భారతీ మహాస్వామి దర్శించుకున్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కమలారాణి దంపతులు స్వామివారిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.


విధుశేఖర భారతీ మహాస్వామికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

జిల్లాలో ఇంటి పన్నులు డిజిటలైజేషన్

డీపీవో శాంతలక్ష్మి

ఆత్రేయపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ పంచాయతీలో భాగంగా ఇంటి పన్నులను డిజిటలైజేషన్ చేపడుతున్నట్టు పంచాయతీ జిల్లా అధికారిణి డి.శాంతలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆత్రేయపురం మండలం ర్యాలి, లొల్ల గ్రామ పంచాయతీలను ఆమె సందర్శించారు. పంచాయతీ రికార్డులు పరిశీలించి పాలనాపరమైన అంశాలపై కార్యదర్శులకు సూచనలు చేశా రు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 22 మండ లాల్లోని 285 గ్రామ పంచాయతీల్లో నెలఖారులోగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలన్నారు. ప్రజలు వ్యాధులబారిన పడకుండా శానిటేషన్ చేపట్టాలని సూచించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేలా పంచాయతీలు దృష్టిసారించాలన్నారు.

వాడపల్లి ఆలయంలో భక్తుల సందడి


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం మంగళవారం కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి బారులుతీరారు. నోము ఆచరిస్తున్న భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.3,56,982 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధర రావు తెలిపారు.

శివాలయంలో పూజలు: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పలు శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. వేకువజామునే మహిళలు స్నానాలు చేసి దీపాలంకరణ జరిపారు. ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి, వాడపల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో రుద్రాభిషేకం చేశారు. భక్తుల శివనామస్మరణతో ఆయా ఆలయాలు మారుమోగాయి.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

కపిలేశ్వరపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకి రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల పరిశీలించారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాలపై పీపీసీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు గ్యారంటీ ఉన్న రైసుమిల్లులను రైతు సేవా కేంద్రంలో డిస్‌ప్లే చేయమని సూచించారు. మండపల్లి, కపిలేశ్వరపురం సమీపంలోని తాతపూడి ఇసుకర్యాంపులు, కపిలేశ్వరపురం-1 ఇసుక ర్యాంపులను ఆర్డీవో పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉచిత ఇసుక అమలు, వాటి విధానాలపై పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలతో సమావేశం జరిపారు. కార్యక్రమాల్లో తహశీల్దార్ పి.చిన్నారావు, ఎంపీడీవో కె.రత్నకుమారి, ఏవో రమేష్‌కుమారి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, వ్యవసాయ సహాయకులు, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు విధానాన్ని తెలుసుకుంటున్న ఆర్డీవో అఖిల

అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్లను కలిసిన శ్రీను



అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్లను అభినందిస్తున్న రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీనేత శ్రీను. పక్క చిత్రంలో రుడా చైర్మన్ వెంకటరమణను అభినందిస్తున్న జనసేన నేత లీలాకృష్ణ

మండపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా నియమితులైన మండపేట శాసనసభ్యుడు వేగుళ్ల జోగేశ్వరరావును పలువురు కూటమి నేతలు కలిసి అభినందించారు. మంగళవారం ఆయన్ను రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు పప్పుల శ్రీను కలిసి అభినందించారు. మండపేట పట్టణానికి చెందిన బిల్డర్ జాస్తి వేంకటేశ్వరరావు, పి.శ్రీనివాస్‌లు ఆయన్ను సత్కరించి అభినందించారు.

కూటమినేతల అభినందనలు: మండపేట ఎమ్మెల్యే వేగుళ్లకు వివిధ పార్టీల కూటమి నేతలు, పలు సంఘాలకు వారు అభినందనలు తెలిపారు. మంగళవారం పట్టణ ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ కలిసి ఆయన్ను సత్కరించారు. పట్టణ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు పంపన శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేగుళ్లను సత్కరించారు.

రుడా చైర్మన్‌ను కలిసిన జనసేననేత లీలాకృష్ణ: రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణను మండపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ మంగళవారం రాజమహేంద్రవరంలో కలిశారు. పదవీ బాధ్యతలు చేపట్టిన రమణను కలిసి అభినందించారు.


కపిలేశ్వరపురంలో లక్షకుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా లక్ష కుంకుమార్చన, గోపూజ

కపిలేశ్వరపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం ఏటిగట్టు సమీపంలోనున్న అగస్తేశ్వర, పాపవినాశేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం లక్ష కుంకుమార్చన, గోపూజ జరిగింది. కార్తీకమాసం ఏకాదశిని పురస్కరించుకుని వైకిరణ్‌శర్మ ఆధ్వర్యంలో పలువురు పండితులు స్వామివార్లకు అభిషేకాలు, పూజలు, లక్ష కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా పలు వురు గోపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

బ్రూసెల్ల టీకాతో వ్యాధులు దరిచేరవు

కపిలేశ్వరపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : నాలుగు నెలల నుంచి 8 నెలల మధ్య ఉన్న పెయ్యదూడలకు బ్రూసెల్ల టీకాతో బతికున్నంత కాలం వ్యాధులు దరిచేరకుండా కాపాడుతుందని ఆలమూరు పశుసంవర్ధనశాఖ ఏడీ డాక్టర్ ఎల్. అనిత అన్నారు. మంగళవారం మండలంలోని మాచర, కోరుమిల్లి గ్రామా ల్లో బ్రూసెల్లోసిస్ టీకాలు, 21వ జాతీయ పశుగణన సర్వేను ఆమె పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ బ్రూసెల్లోసిస్ వ్యాధిబారినపడిన పశువులలో 7 నుంచి 10 నెలల మధ్యలో ఈసుకుపోవడం, ఈనిన తరువాత మాయ వేయకపోవడం వంటివి జరుగుతాయన్నారు. అనంతరం మాచర పశువుల ఆసుపత్రిని సందర్శించిన ఆమె ప్రస్తుతం జరుగుతున్న పశుగణనపై సమీక్షించారు. కార్యక్రమాల్లో పశువైద్యాధికారులు డాక్టర్ వీవీరమణమూర్తి, డాక్టర్ మాధురి, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


← మాచరలో పశువులకు వేస్తున్న టీకాను పరిశీలిస్తున్న ఏడీ అనిత

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

అంబేడ్కర్ విగ్రహాలకు పలువురు నివాళి

ఆలమూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఏ.రాజు అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవ సభ జరిగింది. ముందుగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, మహాత్మాగాంధీతో పాటు పలువురు దేశ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జరిపిన చిత్రలేఖనం, వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ఎంఎం ప్రకాష్, ఏపీవో అరుణకుమారి, ఎంపీఎం ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మండల పరిషత్ కార్యాలయంలో జరిపారు. ఎంపీడీవో వెంకటరామన్ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం, చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఏవో రామస్వరూప్, సీనియర్ సహాయకుడు అనిల్‌కుమార్, జూనియర్ సహాయకుడు ప్రత్యూష, పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

మండపేట: భారత రాజ్యాంగం 75వ దినోత్సవాన్ని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బి.సత్యనారాయణ, కార్యాలయ ఏవో ప్రసాద్, ఎ.నాగేశ్వరరావు, జనార్దన్, ఉపాధి హామీ ఏపీఎం సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. మండపేట మున్సిపల్ టీ.వీ.రంగారావు, మండలంలోని సచివాలయాలు, పంచాయతీల్లో రాజ్యంగ దినోత్సవాన్ని జరిపారు.

కపిలేశ్వరపురం: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కె.రత్నకుమారి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో రాజేంద్రప్రసాద్, ఎస్ఐ రవికుమార్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.


ద్రాక్షారామలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మంత్రి సుభాష్

ప్రజాస్వామ్యానికి పునాది రాజ్యాంగం

మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ): ప్రజాస్వామ్యానికి పునాది భారత రాజ్యాంగమని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం రామచంద్రపురం మెయిన్ రోడ్డులో అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిపిన భారత రాజ్యాంగ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ నాయకులు అల్లం శ్రీనివాస్, దంగేటి గౌరీశంకర్, బీజేపీ నాయకులు పలివెల రాజు, జనసేన నాయకుడు బుంగరాజు, పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని జరిపారు. అంబేడ్కర్ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ వై.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మాచవరంలో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

రాయవరం: భారత రాజ్యాంగ దినోత్సవం సం దర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి నివా ళుర్పించారు. మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు భారతదేశ చిత్రపటం ఆకారంలో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వి.శాంతి సునీత ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరిపారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఎంసీ ఛైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావులపాలెం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని జరిపారు. స్థానిక జడ్పీ బాలికల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్లు కె.సోమేష్, నందం వీరవెంకట సత్యనారాయణ, ఎంఈవోలు ఆర్.నాగకుమార్, బి.శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తపేట: భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గ్రంథంగా రాజ్యాంగాన్ని గౌరవించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. మంగళవారం రాజ్యాంగాన్ని దినోత్సవాన్ని పురస్కరించుకుని కమ్మిరెడ్డిపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కమ్మిరెడ్డిపాలెం అంబేడ్కర్ యూత్ ఏర్పాటు చేసిన షటిల్‌కోర్టును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలి: విద్యార్థి దశ నుంచే రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకోవాలని ఎంపీడీవో పీఎస్ నరేష్‌కుమార్ పేర్కొన్నారు. వానపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ ప్రవేశిక ఫ్లెక్సీని ఆయన ఆవిష్కరించారు. రాజ్యాంగ దినోత్సవాన్ని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలోను ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించి విద్యార్థులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

రాయవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని , విద్యార్థులచే నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం హెచ్‌ఎం వి.శాంతి సునీత ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు రకాల వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

గోవిందు సోదరికి న్యాయం చేస్తాం

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో తాళ్లపొలం సర్పంచ్ కట్టా గోవిందు సోదరి, మేనల్లుడికి న్యాయం చేస్తామని టీడీపీ నాయకులు దొంగల శ్రీధర్, టేకుమూడి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సర్పంచ్ కట్టా గోవిందు కబ్జాలు చేస్తున్నట్లు చేసిన ఆరోపణలు ఖండించారు. మీతల్లి ద్వారా మీ సోదరిలకు సంక్రమించిన పొలం వారికి ఇస్తే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. వైసీపీ పాలనలో గోవిందు సోదరిలును ఇబ్బంది పెట్టారని కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో కట్టా గోవిందు సోదరి నాగమణి, మేనల్లుడు మణికంఠ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ ఇన్‌చార్జి సురేష్

మండపేట. నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండపేటకు చెందిన వైసీపీ నాయకుడు మూడోవార్డు వైసీపీ ఇన్‌చార్జి సి.సురేష్ మంగళవారం వైసీపీకి గుడ్‌బై చెప్పారు. టీడీపీనేత పి.శ్రీనివాసరావు సారథ్యంలో ఎమ్మెల్యే వేగుళ్ల వద్ద మంగళవారం చేశారు. పార్టీలో చేరిన సురేష్‌ను ఆయన ఆహ్వానించారు. కార్యక్రమంలో జాస్తి వేంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, గ్రంథాలయ మాజీ చైర్మన్ వీరెడ్డి, టీడీపీ నేతలు కర్రి తాతారావు యరగతపు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం

మండపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వికలాంగుల హక్కుల పోరాట సమితి 18వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం జిల్లా అధ్యక్షుడు షేక్‌నబీ ఆధ్వర్యంలో జరిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దూళి జయరాజు తదితరులు వీహెచ్‌పీఎస్ జెండా ఆవిష్కరించారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. దివ్యాంగులకు భవనం ఇచ్చిన ఎమ్మెల్యే వేగుళ్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డి.రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన


ఉమావీరేశ్వరస్వామి ఆలయంలో జ్యోతిర్లింగార్చన

రావులపాలెం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా పలు శివాలయాల్లో భక్తులు పోటెత్తారు. ఆయా ఆలయాల్లో వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, బిల్వార్చన తదితర పూజలను చేశారు. రాత్రి ఆయా ఆలయాల్లో లింగాకారంలో దీపాలు వెలిగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దుకాణాలను తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్

మండపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండపేటలో వున్న పలు దుకాణాలను మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు మంగళవారం సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. కేపీరోడ్డు, వేగుళ్ల వీర్రాజు మున్సిపల్ మార్కెట్‌లో వున్న దుకాణాలను ఆయన పరిశీలించి వ్యాపారులకు పలు సూచనలు చేశారు. మున్సిపల్ మార్కెట్ ఎంట్రన్స్‌లో వున్న స్వీట్‌స్టాల్, బజ్జీల బళ్ల వద్ద శుభ్రత లేకపోవడాన్ని గమనించి వారిని మందలించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచకపోతే చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, సచివాలయ ఉద్యోగులు వున్నారు.


దుకాణాలను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రంగారావు

రక్తదానంతో పలువురికి ప్రాణదానం

కొత్తపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రోగులకు రక్తదానం చేసే వారు ప్రాణదాతలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం కొత్తపేట ఆర్ఎస్ బీసీ కన్వెన్షన్ హాలులో జితేంద్ర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అమలాపురం సహస్ర బ్లడ్ డొనేట్ సెంటర్ జితేంద్ర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 106 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, వాసంశెట్టి సత్య పితాని భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

ఆలమూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చెముడులంకలో అయ్యప్పస్వామి పడి పూజ జరిపారు. అయ్యప్పస్వాముల ఆధ్వర్యంలో చెముడులంక శ్రీకృష్ణదేవ రాయ కళ్యాణమండపంలో నర్సరీ రైతు బోడపాటి అయ్యప్ప రాజేశ్వరి దంపతులచే అయ్యప్పపడిపూజను ఏర్పాటు చేశారు. స్వామివారికి పంచామృతాలు, పండ్లరసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. బడుగువానిలంక పడాల వెంకటేశ్వరరావుగురుస్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. చెముడులంక అయ్యప్పదీక్ష స్వాములతోపాటు చొప్పెల్ల, మడికి తదితర గ్రామాల అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.


అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న స్వాములు

కుందూరు శివాలయంలో లక్షపత్రి పూజ

కె.గంగవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుందూరు గ్రామంలోని భ్రమరాంబిక సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం లక్షపత్రి పూజ జరిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు, పత్రిపూజ, అమ్మవారికి కుంకుమ పూజ జరిపారు. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరవగా, ఆలయ అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మంత్రి ప్రత్యేక పూజలు, జ్యోతిర్లింగార్చన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జగతా రమణ, కనకాల శ్రీరామకృష్ణ, సంకురాత్రి వెంకట్రావు, మేడిశెట్టి బాబి, చిర్రా సురేష్, పళ్ళ చినబాబు, పుర్రే చిరంజీవి, కొరిపెల్ల సరేష్, పలివెల సరేష్ తదితరులు పాల్గొన్నారు


పూర్ణాహుతిలో పాల్గొన్న మంత్రి సుభాష్

విద్యార్థులకు యూనిఫారం అందజేత

ఆలమూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు యూనిఫారం అందించాలనే లక్ష్యం తో ఆ కాలేజీలో పనిచేస్తున్న రెగ్యులర్ అధ్యాపకులు రూ.25వేలతో వారికి యూనిఫారం అందించారు. ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఇది చోటుచేసుకుంది. విద్యార్థులంతా ఏకరూప దుస్తుల్లో ఉండాలని కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నరసింహస్వామి, అధ్యాపకులు డి.బాలస్వామి, డాక్టర్ వి.మంజులత, డాక్టర్ బి.ఆశిష్‌బాబు, కరుణశ్రీలు రూ.25వేలతో యూనిఫారం కొనుగోలు చేసి విద్యార్థులకు ఆలమూరు ఎడ్యుకేషనల్ ట్రస్టు ప్రతినిధి గారపాటి త్రిమూర్తులు చేతులు మీదుగా అందిం చారు. విద్యార్థులకు యూనిఫారం అందించిన అధ్యాపకులను పలువురు అభినందించారు.

ఐక్యతకు ప్రతీకలు.. వనసమారాధనలు


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఐక్యతకు ప్రతీకగా వనసమారాధనలు నిలుస్తాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో సంఘ అధ్యక్షుడు నందం వీరవెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో కాపు వనసమారాధన జరిపారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు. వనసమారాధనలో నిర్వహించిన పూజల్లో పాల్గొని అనంతరం వనసమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి నిధులు మంజూరు

రాయవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూర్మాపురం వి.శేషమ్మ ప్రాథమిక సహకార పరపతి సంఘం రక్షణ గోడ నిర్మాణానికి నిధులు మంజూరైనట్టు మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి తెలిపారు. మంగళవారం రాత్రి కూర్మాపురంలో ఆయన మాట్లాడుతూ 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో 50 లక్షల నిధులు మంజూరుకాగా సహకార సంఘం భవనం, ధాన్యం గిడ్డంగి, రైతు సమావేశ భవనం నిర్మించామన్నారు. సహకార సంఘం సమావేశ భవనం ఆధునీకరణ, భవన రక్షణగోడ కోసం ఈ ఏడాది జూలై 30న మంత్రి అచ్చెన్నాయుడుకి వినతిపత్రం ఇచ్చామన్నారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

కామనను ఫోన్‌లో పరామర్శించిన వైఎస్ షర్మిల

మండపేట. నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కామన ప్రభాకరరావు చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన ఆపరేషన్ విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మంగళవారం ఫోన్‌లో పరామర్శించారు. త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆమె కోరినట్టు ఆయన తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కపిలేశ్వరపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర పీహెచ్‌సీ ఆవరణలో బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ బ్లాకులో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎన్‌జీజీవోఎస్ అసోసియేషన్ మండపేట యూనిట్ అధ్యక్షుడు జె.మల్లిఖార్జునుడు, కార్యవర్గం తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఉద్యోగులకు, పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు ఈ శిబిరంలో వైద్య సేవలందిస్తారన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 వరకూ జరిగే ఈ శిబిరంలో డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి కంటి పరీక్షలు, శ్రీ సాయిరాం డెంటల్ ఆసుపత్రి ఇంప్లాంట్ సెంటర్ దంత పరీక్షలు, పల్స్ కార్డియాక్ ఆసుపత్రి ఈసీజీ, అవసరమైన వారికి పలు పరీక్షలు చేస్తారన్నారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

గీతా మందిరంలో సత్యదేవుడి వ్రతాలు

రాయవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వెదురుపాక గీతాజ్ఞాన మందిరం వద్ద మంగళవారం రమా సహిత వీరవెంకట సత్యానారాయణస్వామికి సామూహిక సత్యదేవుడి వ్రతాలు చేశారు. గీత మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్తీకమాసం ఏకాదశి పురస్కరించుకుని నగర సంకీర్తన జరిపారు. ఇటికిరాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో పురోహితుడు అంగర జనార్ధనాచార్యులు అర్చకత్వంలో 100 మంది దంపతులు పీటలపై కూర్చుని సామూహిక వ్రతాలు చేశారు. తాడి వెంకటరెడ్డి, ధనలక్ష్మి దంపతులు, తాడి శ్రీనివాసరెడ్డి బుల్లి వెంకటరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో ఎస్.రామకృష్ణారెడ్డి, పడాల శివ మణికంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సామూహిక సత్యదేవుడి వ్రతాలు చేస్తున్న భక్తులు